
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 36957 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 36957 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 4012 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 1703 క్యూసెక్కులు వదిలారు.



52,372 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 48,476 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 52,372 అమ్మకాలు జరిగాయి.

పచ్చ నేతలకు సెల్యూట్

జిల్లాలో కొందరు పోలీసులు బరి తెగించారు. అధికార పార్టీ నేతలకు తొత్తులుగా మారారు. వారు సూచించిన ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు. కేసులతో సరి పెట్టకుండా ఏకంగా పోలీసుస్టేషన్‌లలో నిర్బంధించి హింసిస్తున్నారు. విచారణ పేరుతో రోజుల తరబడి స్టేషన్‌లో ఉంచి లాఠీలతో చితక్కొడుతున్నారు. విషయం బయటకు చెబితే మరిన్ని అక్రమ కేసులు బనాయిస్తామని హెచ్చరిస్తున్నారు. కొందరిపై కేసులు నమోదు చేయకుండానే పోలీసుస్టేషన్‌కు పిలిపించి రోజంతా అక్కడే ఉంచి వేధిస్తున్నారు.



- వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు
- అద్దంకిలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై పోలీసు దాడులు
- పోలీసు స్టేషన్లలో అక్రమ నిర్బంధం
- రేపల్లెలోనూ ఇదే తీరు
- స్టేషన్లలో ఉంచి టార్చర్
- కేసులు నమోదు చేసినా సకాలంలో కోర్టులో హాజరు పరచని వైనం
- మహిళలను రాత్రిపూట స్టేషన్‌లోనే ఉంచుతున్న ఖాకీలు
- పచ్చనేతల ఒత్తిడితో వైఎస్సార్ సీపీ మద్దతుదారులపై హింస

సాక్షి ప్రతినిధి, బాపట్ల: తాజాగా అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకరరెడ్డి వర్గానికి చెందిన 12 మందిపై అధికార పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టారు. ఆరు రోజుల కిందట ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అప్పటినుంచి బుధవారం వరకూ పోలీసు స్టేషన్‌లోనే నిర్బంధించి చితక్కొట్టినట్లు సమాచారం. బాధితుల కుటుంబ సభ్యులు జిల్లా ఎస్పీ తుషార్ డూడీని కలిసి విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. కేసు ఉంటే అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పెట్టకుండా పచ్చనేతలను సంతోష పెట్టడం కోసం అద్దంకి పోలీసులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జులం ప్రదర్శించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి ధర్మవరంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ నేతలు రెండు వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా టీడీపీ నేతలు ఊరేగింపు నిర్వహిస్తూ వైఎస్సార్ సీపీ నేతలు ఏర్పాటు చేసిన విగ్రహం వద్దకు రాగానే పెద్దఎత్తున బాణసంచా పేల్చి రెచ్చగొట్టేలా ప్రవర్తించారు. ఇది సరికాదని చెప్పిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. పలువురికి గాయాలయ్యాయి. తొలిరోజు వైఎస్సార్ సీపీ నాయకుడు ప్రభాకరరెడ్డికి చెందిన పెట్రోల్ బంకుకు, ట్రిప్పర్లు, జేసీబీ, క్రషర్‌లకు నిప్పంటించారు. దీంతో ప్రభాకరరెడ్డి మార్టూరు, అద్దంకి పోలీసుస్టేషన్లలో టీడీపీ నేతలపై రెండు ఫిర్యాదులు చేసినా మొక్కుబడిగా కూడా చర్యలు తీసుకోలేదు. టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తాళ్లూరి బాలకోటయ్య, కోటేశ్వరరావు, కోటయ్య, దేవరాల పిచ్చయ్య, దేవరాల నాగరాజు, మేకల కోటేశ్వరరావు, జాషువా, మణికంఠలను అదుపులోకి తీసుకొని, ఆరు రోజులుగా అద్దంకి స్టేషన్‌లో ఉంచి తీవ్రంగా హింసిస్తున్నట్లు తెలుస్తోంది. పైగా నిందితులను హింసించే సమయంలో ఒక కానిస్టేబుల్ వీడియో ద్వారా టీడీపీ నేతలకు చూపిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

బల్లికురవలో ఇంటిపై దాడి

ఇటీవల బల్లికురవ మండలం ఉప్పుమాగులూరుకు చెందిన వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రసాదరెడ్డికి చెందిన కారును టీడీపీ నేతలు పగులగొట్టడమే కాకుండా ఆయన ఇంటిపై దాడిచేసి అద్దాలు ధ్వంసం చేశారు. ప్రసాదరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

ఏకపక్షంగా వ్యవహరించిన పోలీసులు

రేపల్లె నియోజకవర్గంలోనూ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారు. ప్రధానంగా నగరం మండలానికి చెందిన ఎస్‌ఐ జులుం మితిమీరినట్లు తెలుస్తోంది.

తోపుడు బండ్ల విషయంలోనూ వివక్ష

నగరం మండల కేంద్రంలో రేపల్లె ప్రధాన మురుగు కాలువపై ఏర్పాటు చేసుకున్న తోపుడు బండ్ల విషయంలోనూ పోలీసులు వివక్ష చూపించారు. టీడీపీ వారివి ఉంచి వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల బండ్లను తీసి పారేశారు. బాధితులు ప్రశ్నిస్తే కేసులు పెడతానంటూ ఎస్‌ఐ బెదిరించి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు.

పోలీసులు ద్వారా బెదిరింపులు

నగరం మండలం సజ్జావారిపాలెంలో ముస్లింల జెండాపండుగకు సంబంధించిన మిగులు డబ్బులు తమకే ఇవ్వాలని టీడీపీ వారు బెదిరించారు. డబ్బులు ఇచ్చేది లేదని, ఈ ఏడాది కూడా తాను పండుగ చేస్తానంటూ వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు తేల్చి చెప్పగా టీడీపీ నేతలు పోలీసులు ద్వారా సదరు వ్యక్తిని నాలుగు రోజుల పాటు స్టేషన్‌కు పిలిపించి వేధింపులకు గురిచేశారు.

కేసు కడతానని బెదిరింపులు

ఈదుపల్లికి చెందిన ఇద్దరు స్నేహితులు మద్యం మత్తులో గొడవ పడ్డారు. దీనిపై అందులో ఒకరు స్నేహితుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరుసటి రోజు వచ్చి తప్పుగా ఫిర్యాదు చేశానని కేసు వెనక్కు తీసుకొనే ప్రయత్నం చేయగా, వైఎస్సార్ సీపీ మద్దతుదారులని తెలుసుకున్న ఎస్‌ఐ ఇందుకు ఒప్పుకోలేదు. కాక పెట్రోల్ డబ్బా, పాత చొక్కా తెచ్చిస్తే హత్యాప్రయత్నం కేసుకడతానని సదరు వ్యక్తిని బెదిరించి ఎట్టకేలకు కేసుకట్టినట్లు సమాచారం. జిల్లాలో ఇలాంటివి కోకొల్లలు. అధికారపార్టీ నేతల ఒత్తిళ్లకు లొంగి కొందరు పోలీసులు అక్రమ కేసులు, వేధింపులతో వైఎస్సార్ సీపీ మద్దతుదారులను దారుణంగా హింసిస్తున్నా జిల్లా పోలీసు బాసు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



న్యూస్‌రీల్

ముగ్గురు ఆర్డీవోలు బదిలీ


గ్లోరియా

రేపల్లె రూరల్: జిల్లాలో ముగ్గురు ఆర్డీవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రేపల్లె ఆర్డీవోగా పని చేస్తున్న హెలా షారోను ఉయ్యూరుకు బదిలీ చేశారు. రేపల్లెకు నేలపు రామలక్ష్మి నియమితులయ్యారు. బాపట్ల ఆర్డీవోగా గ్లోరియా నియమితులయ్యారు. ఆమె ఇప్పటిదాకా చిత్తూరు జెడ్పీ సీఈవోగా పని చేశారు. బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్‌ను ప్రభుత్వానికి నివేదించాల్సిందిగా ఆదేశించారు. విశాఖపట్నం ఎస్‌డీసీ ఎన్‌హెచ్ 16లో పనిచేస్తున్న దేవరకొండ అఖిలను చీరాల ఆర్డీవోగా నియమించారు. ఇక్కడ ఆర్డీవోగా పని చేస్తున్న సూర్యనారాయణరెడ్డిని ప్రభుత్వానికి నివేదించాల్సిందిగా కోరారు.

టెట్‌కు ఏర్పాట్లు పూర్తి

దీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేటఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలో ఏపీ టెట్–2024 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. అక్టోబర్ మూడు నుంచి 21వ తేదీ వరకు జరగనున్న పరీక్షకు 9,556 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. పరీక్షను ఉదయం, మధ్యాహ్నం రెండు సెక్షన్లుగా నిర్వహించబడతాయని వివరించారు. పరీక్షల నిర్వహణకు నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కోటప్పకొండ రోడ్డులోని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల అటానమస్ బ్లాక్–4, ఏ.ఎం.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, పెట్లూరివారిపాలెం, ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల కేసానుపల్లి పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్టు వివరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు డీఈఓ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు ఉదయం ఏడు నుంచి రాత్రి 10 గంటల వరకు తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చ న్నారు. వివరాలకు కార్యాలయ సిబ్బంది కె.ప్రసాద బాబు 9704494654, వై.తిరుపతిరావు 9177020977, జి.జీవరత్నం 9866904960, పి.శంకరరాజు 9963192487 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

క్రోసూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి కె.సంజీవరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు. జాబ్‌మేళాలో ఐదు కంపెనీలు పాల్గొంటున్నట్లు చెప్పారు. జీతం విద్యార్హతను బట్టి రూ.10వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుందన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు 18–35 సంవత్సరాల లోపు హాజరుకావచ్చన్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, 8074393466 సంప్రదించి వివరాలుతెలుసుకోవచ్చని తెలిపారు. httr//rkiuniverre .aprrdc.in నందు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకోని వారు జాబ్‌మేళాలో చేసుకోవచ్చని తెలిపారు.

సీన్ మారింది ..



పిడుగురాళ్ల: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అడుగుపెట్టగానే కోర్టు వాతావరణం కనిపించేది. కోర్టులో న్యాయమూర్తి చుట్టూ క్యాబిన్, రెడ్ మ్యాట్‌తో ప్రత్యేకత కనిపించేది. అలాగే సబ్ రిజిస్ట్రార్‌ని చూడగానే కోర్టులో జడ్జిలా అనిపించేది. రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కూడా అందరి అధికారులాగానే ఉండాలని ఆదేశాలు జారీ చేయడంతో పిడుగురాళ్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా ఎత్తయిన ప్లాట్ ఫారాన్ని తొలగించారు. ఆ స్థానంలో టేబుల్, కుర్చీ ఏర్పాటు చేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 588.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 10,120, ఎడమకాలువకు 5,087, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 28,501, ఎస్ఎల్‌బీసీకి 2,400 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 46,108 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, అంతే నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ఎంతో డిమాండ్

వ్యవసాయ శాఖ డీపీఎం విజయశ్రీ



వేటపాలెం: ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయానికి ఎంతో డిమాండ్ ఉందని వ్యవసాయశాఖ డీపీఎం విజయశ్రీ పేర్కొన్నారు. మండలంలోని పందిళ్లపల్లిలో సేంద్రియ వ్యవసాయం ద్వారా 50 ఎకరాల్లో సాగు చేసిన వరిని ఇంటర్నేషనల్ మార్కెటింగ్ ఆర్గనైజర్ డాక్టర్ శరవణ్ బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా డీపీఎం వారికి సేంద్రియ పద్ధతుల ద్వారా సాగు చేసిన వరి, ఇతర పంటల వివరాలను తెలియజేశారు. డ్రోన్ సహాయంతో ద్రవ జీవామృతాన్ని పంటపై పిచికారీ చేస్తున్న తీరును అంతర్జాతీయ బృందానికి చూపించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు. రైతులు కూడా నాణ్యమైన ఉత్పత్తులతో పాటు అధిక దిగుబడులు సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఐ. కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

పరారీలో ఉన్న గంజాయి విక్రేత అరెస్టు

రేపల్లె రూరల్: పరారీలో ఉన్న గంజాయి విక్రేతను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం రాత్రి ఆయన మాట్లాడారు. అరకు నుంచి గంజాయిని అక్రమంగా తీసుకువచ్చి రేపల్లె ప్రాంతంలో విక్రయిస్తున్న ఆరుగురు నిందితుల్ని గత నెల 24న అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉండి పరారీలో ఉన్న బేతపూడికి చెందిన కలగట్ల భానుప్రకాష్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచామని పేర్కొన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో జరిగే అనర్థాలను వివరిస్తూ త్వరలో పట్టణంలోని అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామని సీఐ చెప్పారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా
మేరుగ నాగార్జున



మేరుగ నాగార్జునను అభినందిస్తున్న లేళ్ల అప్పిరెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి మేరుగ నాగార్జున నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మేరుగ నాగార్జున దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి అనుచరుడిగా రాజకీయ జీవితం ప్రారంభించారు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించారు. 2019లో వేమూరు నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా గెలుపొందారు. అంతకు ముందు రెండు సార్లు పోటీచేసి ఓడినా.. పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో శాసనసభకు ఎన్నికయ్యారు. మంత్రివర్గంలో సాంఘిక సంక్షేమశాఖామంత్రిగా పని చేశారు. ఉన్నత చదువులు చదివిన నాగార్జున రాజకీయాల్లో చురుగ్గా ఉంటారన్న పేరుంది. సామాజిక అంశాలపై అవగాహన ఉన్న ఆయన ఆయా వర్గాలతో పాటు పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన నాగార్జున 1994–2007లో ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఎన్ఎస్‌యూఐ, యువజన, కాంగ్రెస్ పార్టీల్లో వివిధ పదవుల్లో చురుగ్గా వ్యవహరించారు. రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షుడిగా పని చేశారు. విజయవాడలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ ప్రతిష్టాపన చైర్మన్‌గా ఉన్నారు. పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా తనకు అవకాశమిచ్చిన అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయనని తెలిపారు. . మాజీ మంత్రి మేరుగ నాగార్జునను జిల్లా అధ్యక్షుడిగా నియమించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. బాపట్ల జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన మేరుగ నాగార్జునను ఎమ్మెల్సీ, పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి ఎల్. అప్పిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

పార్లమెంట్ పరిశీలకుడిగా మాజీ ఎంపీ నందిగం సురేష్



- పార్టీ పార్లమెంట్ పరిశీలకుడిగా బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను నియమించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులిచ్చింది. నందిగం సురేష్‌ను పరిశీలకుడిగా నియమించడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

అంతా మనవాళ్లే.. అడ్డుకుంటే కేసులు పెడతాం !

- పర్చూరు షాడో ఎమ్మెల్యే బెదిరింపులు
- గ్రావెల్ వాహనాలు నిలిపివేసిన గ్రామస్తులు

మార్టూరు: అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను గ్రామస్తులు అడ్డుకున్న ఘటన బుధవారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో మండలంలోని ద్వారకపాడులో జరిగింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ద్వారకపాడు గ్రామ సమీపంలో బుధవారం రాత్రి కొందరు రెండు జేసీబీల ద్వారా పలు టిప్పర్లకు గ్రావెల్ లోడ్ చేసి పంపిస్తున్నారు. సమాచారం అందుకున్న గ్రామస్తులు ఒంటిగంట ప్రాంతంలో క్వారీ వద్దకు చేరుకొని రెండు గంటల వరకు వాహనాలను నిలిపివేసి అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా తమ గ్రామం నుంచి గ్రావెల్ ఎలా తరలిస్తారని వాహనదారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో రెండు జేసీబీలు, ఐదు టిప్పర్లు గురువారం ఉదయం వరకు క్వారీలోనే నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఉంటూ ఆయన వ్యవహారాలు అన్నీ తానై చక్కబెడుతున్న షాడో ఎమ్మెల్యే గురువారం ఉదయం ద్వారకపాడు టీడీపీ నాయకులకు ఫోన్ చేసి సీరియస్ అయినట్లు సమాచారం. '' గ్రావెల్ తవ్వే వారు, తరలించేవారు అందరూ మనవాళ్లేనని వారిని మీరు ఎలా అడ్డుకుంటారు.. మీపై పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టిస్తా''నని బెదిరించినట్లు కూడా సమాచారం. ఇంత జరుగుతున్న రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడాన్ని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

కేసుల విచారణ వేగవంతం చేయండి

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న సీఐ అహ్మద్ జాని

బాపట్ల: పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశించారు. క్యాంప్ కార్యాలయ సమావేశ హాలులో గురువారం జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. వివరాలను స్క్రీన్ పై ప్రదర్శిస్తూ సంబంధిత అధికారుల నుండి కేసు వివరాలను, దర్యాప్తు చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కేసు ఫైల్స్ ను పరిశీలించారు. నేరాల కట్టడికి తీసుకుంటున్న చర్యల గురించి, వీక్లీ ప్లాన్ ఆఫ్ యాక్షన్‌లో భాగంగా జిల్లా పోలీస్ అధికారులు నిర్వహిస్తున్న కార్యక్రమాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. గంజాయి, ఎస్సీ ఎస్టీ, మిస్సింగ్ కేసులు, మహిళా సంబంధిత నేరాలు ఫోక్సో కేసులు, దొంగతనాలు, నేరాలపై ఉక్కుపాదం మోపాలని తెలిపారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా పెట్టాలని చెప్పారు. రాత్రివేళ గస్తీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకోవడానికి గల కారణాలను అధ్యయనం చేసి అక్క తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో సీసీ కెమెరాలు అవసరమైన ప్రదేశాలను గుర్తించి, జాబితాను సిద్ధం చేసి కార్యాలయానికి పంపాలని పోలీస్ అధికారులకు సూచించారు. అనంతరం గతవారం జరిగిన లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించిన బాపట్ల పట్టణ సీఐ జానీ అహ్మదీకి, నేరాలు ఛేదించడంలో విశేష కృషి చేసిన ఇతర పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో వినాయకుని నిమజ్జనాలు జరిగేందుకు కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, ఏఆర్ డీఎస్పీ ఎస్. చంద్రమోహన్, ఎస్‌బీ సీఐ జి.నారాయణ, డీసీఆర్బీ సీఐ బాలమురళీకృష్ణ, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చికిత్స కోసం వెళ్లి వస్తుండగా మృత్యువాత

- గన్నవరం వద్ద భారీ రోడ్డు ప్రమాదం
- జే.పంగులూరు మండలానికి చెందిన ముగ్గురు మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు, ఒకరికి స్వల్ప గాయాలు
- బంధువు వైద్య నిమిత్తం వైజాగ్ వెళ్లిన బాధితులు
- తిరుగు ప్రయాణంలో పెట్రోల్ బంకు సమీపంలో లారీని ఢీకొన్న కారు
- విషాదంలో కుటుంబ సభ్యులు



ఘటనా స్థలంలో లారీ కిందకు దూసుకుపోయిన కారు



మార్కు (ఫైల్)



మేరిమ్మ (ఫైల్)



ప్రేమమ్మ (ఫైల్)

జే.పంగులూరు: అనారోగ్యంతో బాధపడుతున్న భార్యను ఆసుపత్రిలో చేర్పించి తిరిగి వస్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రంగా, ఒకరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన కృష్ణా జిల్లా గన్నవరం వద్ద బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.

బాధితుల వివరాల మేరకు.. మండల పరిధిలోని కోటపాడు గ్రామానికి చెందిన పల్లెపోగు ప్రేమమ్మ (41) కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఈ క్రమంలో రెండు రోజుల నుంచి కాళ్లు బాగా వాచి నీరు కారుతున్నాయి. దీంతో భర్త ఆదాం, అల్లుడు కురగంటి మార్కు (25), బావమరిది భార్య పోలిపోగు మేరిమ్మ (40), అన్న కొడుకు మురారితో కలిసి కారు తీసుకొని ఆమెను వైజాగ్‌లోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. మంగళవారం కోటపాడు నుంచి వేకువ జామునే వీరు ఐదుగురు కారులో వైజాగ్ వెళ్లారు. బుధవారం ప్రేమమ్మకు వైద్యం చేయించి సాయంత్రం కోటపాడుకు బయలు దేరారు. బుధవారం అర్ధరాత్రి కృష్ణాజిల్లా గన్నవరం వద్ద జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు సమీపంలో ఆగిఉన్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ఆదాంకు కాళ్లు, చేతులు విరిగాయి, డ్రైవర్ సీటు పక్కన కూర్చున ఆదాం అల్లుడు కురగంటి మార్క్‌కు బలమైన గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. వెనక సీటులో డ్రైవర్ వెనక ఉన్న బావమరిది భార్య మేరమ్మ (40) అక్కడిక్కడే మృతి చెందింది. మరో వైపు ఉన్న అన్నకొడుకు మురారీకి బలమైన గాయాలయ్యాయి. మృతదేహాలను గురువారం రాత్రి తీసుకొచ్చే సమయంలో ప్రేమ తమ అల్లుడు, బంధువు చనిపోయారన్న బాధతో గుండె పగిలి ప్రేమమ్మ మృతిచెందింది. దీంతో బంధువులు మళ్లీ ఆమెను పోస్టుమార్టం కోసం తరలించారు. ఒకే రోజులో ముగ్గురు చనిపోవడంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

భర్త మరణ వార్తతో కన్నీరుమున్నీరు

మృతుడు కురగంటి మార్కు (25)కు నాలుగేళ్ల కిందట కోటపాడు గ్రామానికి చెందిన పల్లెపోగు ప్రేమ, ఆదాం కూతురు అయిన ముకన్యతో వివాహమైంది. మార్కు బేల్దారి మేస్త్రి. ఇంటి వద్దనే ఉంటూ పనులు, వీలుంటే పొలం పనులు చేసుకుంటూ భార్యాభర్తలు సంతోషంగా ఉండేవారు. గత 10 రోజుల కిందట కుమారుడి మొదటి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. తల్లిని ఆస్పత్రిలో చూపించి, క్షేమంగా ఇంటికి వస్తాడనుకునే లోపే భర్త మరణ వార్త విని కన్నీరు మున్నీరుగా విలపించింది ముకన్య. విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.

బస్సులో వెళితే ప్రాణాపాయం తప్పేది

కొండమూరు గ్రామానికి చెందిన మృతురాలు పోలిపోగు మేరిమ్మ (40) ఆదాం బావమరిది భార్య. ఆమెకు ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. భర్త దీనయ్య, ఆమె వ్యవసాయ కూలీలు. వదినమ్మను చూపించుకొని వస్తాను.. జాగ్రత్తని భర్తకి, పిల్లలకు మంచీ చెడులు చెప్పి మేరిమ్మ వెళ్లింది. ఈలోపే మరణవార్త విని భర్త, పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ప్రేమను ముందు బస్సుకు తీసుకొని వెళదాం అని భర్త ఆదాం అనుకున్నాడు. కాని ఆమె కాళ్లు బాగా వాయడంతో నడవలేని స్థితిలో ఉండటంతో చేసేది లేక బంధువులను తీసుకొని వైజాగ్ బయలు దేరారు. బస్సుకు వెళ్లిన ప్రాణాపాయం తప్పేదని తలుచుకొని బంధువులు రోదిస్తున్నారు.

క్లుప్తంగా

దేవదాయ శాఖ డీసీగా బాధ్యతలు స్వీకరించిన కేబీ శ్రీనివాసరావు



పట్నంబజారు: దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్‌గా కేబీ శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. గురువారం నాజ్‌సెంటర్‌లోని దేవదాయ శాఖ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. గతంలో గుంటూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేసిన కేబీ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి డీసీగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. పెదకాకాని ఆలయం, ఒంగోలు అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి, డీసీ హోదాలో మాలకొండ ఆలయం బాధ్యతలు చేపట్టారు. ఆయన్ను గుంటూరు డీసీగా నియమించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల పరిరక్షణకు కృషి చేస్తామని తెలిపారు. శాఖ భూములు ఆక్రమణలకు గురి కాకుండా, ఇప్పటికే ఆక్రమణల్లో ఉంటే తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయాల్లో అన్ని ఏర్పాట్లు కల్పిస్తామని చెప్పారు. ఆయన్ను పలువురు అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

నార్త్‌జోన్, సౌత్‌జోన్ మ్యాచ్ ప్రారంభం



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్ నిర్వహిస్తున్న ఏసీఏ ఇంటర్ జోన్ క్రికెట్ పోటీలో భాగంగా నార్త్‌జోన్, సౌత్‌జోన్ మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. వర్షం కారణంగా బుధవారం తొలిరోజు ఆట రద్దు కాగా, గురువారం టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నార్త్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో తొమ్మిది వికెట్లు నష్టానికి 259 పరుగులు చేసింది. జట్టులోని జి.సాయి పూర్ణతేజ 143 బంతుల్లో 100 పరుగులు చేయగా, బి.సుహాస్ 53 పరుగులు సాధించాడు. సౌత్ జోన్ బౌలర్లు భార్గవానంద్ నాలుగు, రెడ్డి ప్రకాష్ మూడు వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ రెండవ రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టపోయి 66 పరుగులు చేసింది. యోగానంద్ 31, వై.తేజరెడ్డి 27 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

మైనింగ్ ఏడీగా ప్రకాష్ కుమార్



దాచేపల్లి: భూగర్భ గనుల శాఖ దాచేపల్లి సహాయ సంచాలకులుగా పులివర్తి ప్రకాష్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏడీగా విధులు నిర్వర్తించిన అశోక్‌కుమార్ అమలాపురం బదిలీ కాగా, చిత్తూరులో విధులు నిర్వర్తిస్తున్న ప్రకాష్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కార్యాలయం సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన బాధ్యతలు చేపట్టి సిబ్బందితో మాట్లాడారు.

వీడియోకెక్కిన పచ్చ దందా

- ఇసుక మాఫియాతో టీడీపీ నేత పంచాయతీ
- ట్రాక్టర్‌కు రూ. వెయ్యి ఇచ్చేలా ఒప్పందం
- ఈ తంతును వీడియో తీసిన మాజీ ఎమ్మెల్యే అనుచరుడు
- ఆగ్రహం వ్యక్తం చేసి మొబైల్ స్వాధీనం చేసుకున్న అధికార పార్టీ నేత
- ఒప్పందం చెడడంతో వీడియో తీసిన వ్యక్తిపై ఇసుక మాఫియా చిందులు
- చీరాలలో చర్చనీయాంశంగా వ్యవహారం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: పచ్చ నేత అక్రమాల వ్యవహారం ఇప్పుడు చీరాలలో హాట్ టాపిక్‌గా మారింది. నియోజకవర్గంలో ఎక్కడ నిలుచున్నా ఇసుక మొదలు, రియల్, రిసార్ట్‌ల దందాల నుంచి అధికారుల బదిలీల వరకు అక్రమాల వ్యవహారంపై విస్తృతంగా చర్చ సాగుతోంది. ఆయన వసూళ్ల పర్వాన్ని జనం కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. మరో వైపు పచ్చ నేత అక్రమాలను అవకాశంగా తీసుకొని వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గం నుంచి ఆయన్ను సాగనంపేందుకు చీరాల మాజీ ఎమ్మెల్యే వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఆయన అవినీతిని అనుచరుల ద్వారా చాపకింద నీరులా జనంలోకి తీసుకెళుతున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అందులో భాగంగా సదరు నేత అక్రమాల వ్యవహారాల్ని వీడియో రూపంలో సేకరించి పచ్చ పార్టీ అధిష్టానానికి చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా అక్రమాల్ని ఆయన అనుచరుడు స్వయంగా వీడియో తీస్తూ పట్టుబడడం ఇందుకు బలం చేకూరుస్తోంది.

ఇసుక మాఫియా ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్

చీరాల పచ్చ నేత నాలుగు రోజుల కిందట నియోజకవర్గంలోని చీరాల, పందిళ్లపల్లె ప్రాంతాలకు చెందిన ఇసుక మాఫియాతో సమావేశమయ్యారు. ఇసుకను అక్రమంగా అమ్ముకుంటున్న రాజేష్ (పచ్చ నేత అనుచరుడు) వేటపాలెం ప్రాంతంలో ట్రాక్టర్‌కు రూ.650, చీరాల ప్రాంతానికి తరలించినందుకు రూ. 950 మాత్రమే ఇస్తున్నందున గిట్టుబాటు కావడంలేదని, ట్రాక్టర్‌కు రూ. వెయ్యి చొప్పున తామే కప్పం కడతామని, ఇసుక తరలింపు అనుమతి తమకే ఇవ్వాలని ఇసుక ట్రాక్టర్ల మాఫియా విన్నవించింది. దీనిపై కొద్దిసేపు సమాలోచనలు జరిగిపిన పచ్చనేత చివరకు ఈ ప్రతిపాదనకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. రెండు మూడు రోజుల్లోనే ఇసుక రవాణా మొదలు పెట్టుకోవచ్చని ట్రాక్టర్ యజమానులకు చెప్పారు. తనకు రావాల్సిన వాటాలో తేడా లేకుండా చూడాలని, ఒక్క ట్రాక్టర్ మిస్ కాకుండా కప్పం చెల్లించాలని చెప్పారు. తేడా వస్తే అన్నీ ఆపేస్తానని చెప్పిన పచ్చ నేత సమావేశం ముగించి లేచి కారువద్దకు చేరుకున్నారు.

వీడియో డిలీట్

పచ్చనేత ఇసుక దందా మొత్తం వ్యవహారాన్ని పందిళ్లపల్లెకు చెందిన చీరాల మాజీ ఎమ్మెల్యే అనుచరుడు వీడియో తీశాడు. ఐదు నిమిషాలు ఆగితే వీడియో మాజీ ఎమ్మెల్యేకు సజావుగా చేరేది. ఇంతలో వీడియో తీస్తున్న విషయాన్ని పసిగట్టిన అనుచరుడు విషయం పచ్చ నేత చెవిలో ఊదాడు. ఉలిక్కిపడ్డ పచ్చ నేత, ఆయన అనుచరులు ఒక్క ఉదుటున వీడియో తీస్తున్న వ్యక్తిపై దాడిచేసి పట్టుకుని మొబైల్ లాక్కున్నారు. అనంతరం చూడగా పచ్చ నేత ఇసుక పంచాయతీ వ్యవహారం మొత్తం వీడియో రూపంలో ఉంది. బెంబేలెత్తిన అధికార పార్టీ నేత దాన్ని డిలీట్ చేయడంతోపాటు మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక పంచాయతీని వీడియో తీసి ఒప్పందం చెడగొట్టావంటూ ఇసుక మాఫియా వీడియో తీసిన వ్యక్తికి చీవాట్లు పెట్టింది.

చీరాల నుంచి సాగనంపేందుకు యత్నాలు

ఇప్పటికే సదరు మాజీ ఎమ్మెల్యే అనుచరుడు చీరాల పచ్చనేత అక్రమాల వ్యవహారాలను పలు వీడియోలు తీసి మాజీ ఎమ్మెల్యేకు చేర్చగా, ఆయన వాటిని పచ్చ పార్టీ ముఖ్య నేతలకు చేరవేస్తున్నట్లు సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి పచ్చనేత అవినీతి, అక్రమాలను బయటపెట్టి చీరాల నుంచి సాగనంపేందుకు మాజీ ఎమ్మెల్యే వ్యూహ రచన చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కొసమెరుపు ఏమిటంటే సదరు మాజీ ఎమ్మెల్యేపై విపరీతంగా ప్రేమ కురిపిస్తున్న పచ్చ నేత మాత్రం ఆయన చెప్పిన అధికారులనుందరినీ చీరాల, వేటపాలెం, చినగంజాం ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే అధికారంలో ఉన్నప్పుడు పోస్టింగులు ఇచ్చిన పలువురు అధికారుల్ని పచ్చనేత ఇప్పుడు ఆయన చెప్పిన చోటుకు బదిలీ చేస్తుండడంపై చర్చ సాగుతోంది. మొత్తంగా చీరాల పచ్చనేత అవినీతి దందా వీడియో వ్యవహారంతో పాటు మాజీ ఎమ్మెల్యే వ్యవహారం ఇప్పుడు చీరాలలో హాట్ టాపిక్‌గా మారింది.

30 నుంచి జిల్లా క్రీడా జట్ల ఎంపికలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి అండర్–14, 17 జిల్లా జట్ల ఎంపికలను నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మెల్లంపూడి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న తాడేపల్లి మండలం పెనుమాక జెడ్పీ హైస్కూల్లో బాలబాలికలకు అథ్లెటిక్స్, అచ్చంపేటలోని ఏపీ సాంఘిక సంక్షేమ పాఠశాలలో రెజ్లింగ్, నరసరావుపేటలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో బాస్కెట్‌బాల్ ఎంపికలు జరుగుతాయని వివరించారు. అక్టోబర్ 1న కారంపూడిలోని జెడ్పీ హైస్కూల్లో అండర్–14 విభాగంలో ఖోఖో, తెనాలిలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న జేఎస్ ఫిట్‌నెస్ సెంటర్‌లో తైక్వాండో ఎంపికలు ఉంటాయని చెప్పారు. వివరాలకు 99633 86100 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు. కుంచనపల్లిలోని అరవింద హైస్కూల్లో అండర్–14, 17 విభాగాల్లో కరాటే పోటీలకు 95817 66907 నంబర్లో సంప్రదించాలని తెలిపారు. అక్టోబర్ 1న గుంటూరు అమరావతి రోడ్డులోని ఆలా ఆస్పత్రి వద్ద ఉన్న ఇండియన్ షూటింగ్ అకాడమీలో జరిగే పోటీలకు 94906 39441లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఆయా క్రీడాంశాల్లో పాల్గొనే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, టెన్త్ మార్కుల జాబితా, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకొస్తేనే అనుమతిస్తామని మెల్లంపూడి రవి తెలిపారు.

ఆ పరిహారంతో మాకు న్యాయం జరగదు

- రైతులతో సమావేశమైన జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే
- సేకరించనున్న 153 రైతులకు చెందిన 50 ఎకరాల పంట భూమి
- సమావేశానికి వచ్చిన చల్లగుండ్ల, దేచవరం, రూపెనగుంట్ల గ్రామాల రైతులు
- ప్రభుత్వ లెక్కల ప్రకారం భూముల విలువ ఎకరా రూ.4.75లక్షలు
- పరిహారమిచ్చేది రోడ్డుకు దూరం గల భూములకు రూ.12.50లక్షలు
- దగ్గరగా ఉన్న భూములు ఎకరాకు రూ.32లక్షలు
- పరిహారంతో న్యాయం జరగదని మండిపడుతున్న రైతులు



పత్రాలు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే

నకరికల్లు: "మావి రెండు పంటల పండుతూ హైవేకు ఆనుకొని ఉన్న పంట భూములు.. మీరిచ్చే పరిహారం మాకు సరిపోదు" అంటూ కలెక్టర్ ఎదుట భూములు కోల్పోతున్న రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నకరికల్లు అడ్డరోడ్డు నుంచి చీరాల ఓడరేవు వరకు నాలుగులైన్ల రహదారి ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులతో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సమావేశం నిర్వహించారు. సమావేశానికి చల్లగుండ్ల, రూపెనగుంట్ల, దేచవరం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ నకరికల్లు అడ్డరోడ్డు నుంచి ప్రారంభమవుతున్న నాలుగులైన్ల రహదారిలో రోడ్డుకు ఇరువైపులా గుర్తించిన భూమిలో 153 మంది రైతులకు చెందిన 50 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేకరించాల్సి ఉన్న భూమి ధర ఎకరా రూ.4.75 లక్షలు ఉందన్నారు. ఈ లెక్క ప్రకారం రోడ్డుకు దూరంగా పొలాలకు ఎకరా రూ.12.50లక్షలు, రోడ్డుకు సమీపంలో ఉన్న భూములకు ఎకరాకు రూ.32లక్షల వరకు నష్టపరిహారం రూపంలో చెల్లిస్తామన్నారు. ఇళ్ల స్థలాలు నష్టపోతున్నట్లయితే సెంటుకు రూ.1.25లక్షలు, బోర్లు, ఇళ్లు తొలగించాల్సి వస్తే ఆర్ అండ్ బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లిస్తారని అన్నారు.

ఈ పరిహారం సరిపోదు

ప్రస్తుతం ఇస్తామన్న పరిహారంతో తమకు ఎలాంటి న్యాయం చేకూర్చదని చల్లగుండ్ల, రూపెనగుంట్ల, దేచవరం గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా రెండు పంటలు పండుతూ హైవేకు ఆనుకొని ఉన్న పంట భూములకు ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం చూస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. రోడ్డు నిర్మాణం చేసే క్రమంలో రోడ్డు పొలం మధ్యగా వేస్తే ఒక పక్క కొద్దిమేర భూమి, మరొకవైపు కొద్దిమేర భూమి మిగులుతుందని దాంతో ఆ భూమితో ఎలాంటి ప్రయోజనం ఉండదని పలువురు రైతులు వాపోయారు. మిగులు భూమికి కూడా పరిహారం ఇవ్వాలని, మిల్క్ డెయిరీకి సమీపంలో వస్తున్న రింగ్ రోడ్డు వలన పూర్తి భూమిని కోల్పోతున్న రైతులు న్యాయం చేయాలని పలు డిమాండ్లు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఆయన రైతులతో మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు నేషనల్ హైవేస్ అథారిటీ వారి దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ కె.పుల్లారావు, కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్ శివనాగిరెడ్డి, నేషనల్ హైవేస్ ఏఈ ప్రకాష్, ఆయాగ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

నష్ట పరిహార నమోదులో పక్షపాతం



కొల్లూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొత్తగూడెం, తిప్పలకట్ట వాసులు

న్యాయం చేయాలని ముంపు బాధితుల డిమాండ్

కొల్లూరు : వరదలతో కారణంగా ఏర్పడిన నష్ట నమోదులో చోటుచేసుకున్న పక్షపాతం వల్ల తమకు న్యాయం జరగలేదని పలు గ్రామాలు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో గురువారం మండలంలోని తప్పిలకట్ట, కొత్తగూడెం గ్రామాలకు చెందిన పలు కుటుంబాలు తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లును కలసి వినతిపత్రం సమర్పించాయి. వివక్ష కారణంగా తమకు వాటిల్లిన నష్టాలను ఆయన ముందు ఏకరవు పెట్టారు. కొత్తగూడేనికి పలువురు మహిళలు మాట్లాడుతూ వరదల వల్ల ఇళ్లు మునిగి తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఇచ్చే పరిహారం రూ.10వేలతో మరమ్మతులు ఎలా చేసుకోవాలంటూ వాపోయారు. తమ గ్రామానికి స్వచ్ఛంద సంస్థల సాయం సైతం అందకపోవడంతో నిరాశ్రయులుగా మిగిలామని తెలిపారు. ప్రభుత్వ సాయాన్ని పెంచాలని కోరారు. గ్రామంలోని ఎన్నో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, దుకాణాలు వరద నీటిలో మునిగి నష్టాలకు గురైతే నమోదుకు నోచుకోకపోవడంతో పరిహారం దక్కకుండా పోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం బ్యాంకులో వేసిన రూ. 10 వేలను దోనేపూడిలో బ్యాంక్ సిబ్బంది ద్వారా రుణాల పేరుతో చెల్లించకుండా నిలిపివేస్తున్నారని మొరపెట్టుకున్నారు. తిప్పలకట్టకు చెందిన పలువురు మాట్లాడుతూ ఎస్సీ, బీసీ ప్రాంతాల్లో ఇళ్లు, మరణించిన పశువులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు నమోదు చేయకుండా అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్ మాట్లాడుతూ తక్షణం విచారణ జరిపించి వాస్తవాలను పరిశీలించి నష్ట నమోదు చేయించడానికి ప్రయత్నిస్తామని, ఉన్నతాధికారుల దృష్టికి సైతం సమస్యను తీసుకువెళతామని హామీ ఇచ్చారు. దోనేపూడి బ్యాంక్ మేనేజర్‌తో వెంటనే ఫోన్‌లో మాట్లాడారు. ఆంక్షలు లేకుండా నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పంతగాని నాగమల్లేశ్వరరావు, తోడేటి సురేష్ పాల్గొన్నారు.

విద్యుత్తు అదాలత్‌తో సమస్యలకు పరిష్కారం

కొరిటెపాడు(గుంటూరు): విద్యుత్ అదాలత్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీసీపీడీసీఎల్) కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ సూచించారు. గుంటూరు పాన్నూరు రోడ్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం అదాలత్ నిర్వహించారు. వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. 15 దరఖాస్తుల్లో తక్షణం 10 పరిష్కరించేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ.. గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాలతో పాటు సీఆర్‌డీఏ పరిధి కోసం సీజీఆర్ఎఫ్ కార్యాలయం గుణదలలో ఏర్పాటు చేశామన్నారు. సీజీఆర్ఎఫ్ ద్వారా మూడేళ్లలో 600 విద్యుత్ కేసులను పరిష్కారం చేశామని వివరించారు. ఫిర్యాదు చట్టబద్ధంగా ఉంటే అందిన 60 రోజుల్లోపు సమస్య పరిష్కరిస్తారని చెప్పారు. వివరాలకు 94910 34319 నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సీజీఆర్ఎఫ్ సభ్యులు కే వెంకటకృష్ణ, ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఎ.సునీత, విద్యుత్ శాఖ సిబ్బంది, గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకర్గాలు, పెదకాకాని, గుంటూరు రూరల్ మండలాలకు చెందిన వినియోగదారులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదంపై పాలకుల కుటిల నీతి

నరసరావుపేట: తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీ వెంకటేశ్వస్వామి లడ్డు ప్రసాదాన్ని వివాదం చేసి రాజకీయ లబ్ధి పొందాలని పాలకుల కుటిల నీతిని ప్రజలు అర్థం చేసుకోవాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) కోరింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. లడ్డూలో కల్తీ జరిగిందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఉపయోగించే మెటీరియల్, నెయ్యి వగైరా ఏ కంపెనీలు ఎవరు సరఫరా చేస్తున్నారనే దానిపై ప్రభుత్వం విచారణ జరిపి భక్తులకు తెలియచేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ తక్షణమే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటినా రైతు పెట్టుబడి సహాయం నేటికీ అందలేదన్నారు. తల్లి దీవెన, ఉచిత బస్సు ప్రయాణం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి, సూపర్ డీఎస్సీ ఎక్కడని ప్రశ్నించారు. వీటితో పాటు అనేక హామీలు ఇచ్చి వాటి గురించి ప్రస్తావనే లేకుండా ఇతర అంశాలను తెరపైకి తెచ్చి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం మానుకోవాలని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే కల్తీ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రేక్షకులను అలరించిన రేలంగి సినిమాలు



రేలంగి నరసింహారావుకు అక్కినేని ఆత్మీయ పురస్కారం అందజేస్తున్న దృశ్యం

నగరంపాలెం: హాస్యనటన ఒక ప్రత్యేకత అని, అయితే హాస్య దర్శకత్వం అత్యంత క్లిష్టతరమైనదని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. కళావిపంచి (హైదరాబాద్), ఆరాధన ఆర్ట్స్ అకాడమీ (గుంటూరు) సంయుక్తంగా డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా బృందావన్‌గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గురువారం రాత్రి ప్రముఖ హాస్య దర్శకులు రేలంగి నరసింహారావుకు అక్కినేని ఆత్మీయ పురస్కారాన్ని ప్రదానం చేశాయి. సభకు మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ రేలంగి నరసింహారావు అనేక విజయవంతమైన హాస్యరస భరిత చిత్రాలకు దర్శకత్వం వహించారని తెలిపారు.

వారంలో ఒక్క రోజైనా చేనేత వస్త్రాలు ధరించాలి



కొరిటెపాడు(గుంటూరు): స్వదేశీ వస్తువులను వినియోగించడం ద్వారా తయారీదారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ పిలుపునిచ్చారు. స్థానిక అమరావతి రోడ్‌లోని బండ్లమూడి గార్డెన్స్‌లో నాబార్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళల ప్రదర్శనను గురువారం ఆయన ప్రారంభించారు. స్టాల్స్‌ను సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వారంలో ఒక్క రోజు అయినా అందరూ చేనేత వస్త్రాలు ధరించాలన్నారు. తద్వారా ఆ వృత్తిదారులకు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, ఒడిశాల నుంచి వచ్చిన వారు 46 స్టాల్స్ ఏర్పాటు చేశారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగనుంది. సీజీజీబీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, యూబీఐ డీజీఎం ఎస్.జవహర్, ఎస్‌బీఐ డీజీఎం కృష్ణ కుమార్ ప్రభు మాట్లాడుతూ చేనేత, హస్తకళల గ్రూపులకు తగిన రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో నాబార్డు సీజీఎం ఎంఆర్ గోపాల్, నాబార్డు డీడీఎం శరత్, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్స్ పేరుతో మోసం చేసి పరారీ

లక్ష్మీపురం: చిట్స్ పేరుతో సుమారు రూ.74,70,695 లక్షలు మోసం చేసి పరారైన ఘటనలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు బుధవారం అర్ధరాత్రి కేసు నమోదు చేసిన ఘటన చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చైతన్య పురి కాలనీ మెయిన్ రోడ్డు ప్రాంతానికి చెందిన గార్లపాటి నాగలక్ష్మి అదే ప్రాంతానికి చెందిన మారెడ్డి చంద్రావతి అనే మహిళ వద్ద చిట్స్ వేయడం ప్రారంభించింది. చంద్రావతి చిట్స్‌లో సభ్యులుగా మరి కొందరు చేరారు. చిట్ చివర వరకూ రావడంతో చంద్రావతి చిట్స్ సభ్యులకు చెల్లించాల్సిన నగదు ఇవ్వలేదు. సొంత ఇంటిని సైతం విక్రయించి, కుటుంబ సభ్యులతో పారిపోయింది. దీంతో బాధితులు దిక్కుతోచక అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించారు. వారు ఫిర్యాదు చేయగా పోలీసులు బుధవారం అర్ధరాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాస్

నెహ్రూనగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉమ్మడి గుంటూరు జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా డాక్టర్ కె. శ్రీనివాస్ గురువారం అరండల్‌పేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నెల్లూరు, భీమవరంలో ఆయన పనిచేశారు. తరువాత పదోన్నతిపై గుంటూరు జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా వచ్చారు. సెబ్ ఏసీగా నెల్లూరు పనిచేశారు. 2023లో డెప్యూటీ కమిషనర్‌గా పదోన్నతిపై సెబ్ హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహించారు. ఆ తరువాత ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేయడంతో గుంటూరు డెప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నాటుసారా నియంత్రణ, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ అమ్మకాలు జరగకుండా పటిష్ట నిఘా పెంచుతామన్నారు. ప్రభుత్వ ఆదాయం పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బందికి తగిన తోడ్పాడు అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సిబ్బంది, ఉద్యోగ సంఘ నాయకులు డీసీకి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.



అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవికుమార్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ

అసిస్టెంట్ కమిషనర్‌గా ఎం.రవికుమార్‌రెడ్డి

జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా ఎం.రవికుమార్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎ. అరుణ కుమారి కూడా గురువారం అరండల్‌పేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో వారి చాంబర్లలో బాధ్యతలు స్వీకరించారు.

వానాకాలం.. విద్యుత్‌తో భద్రం!

- అప్రమత్తంగా లేకపోతే ప్రాణాలకే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలని అధికారుల సూచన

కొరిటెపాడు(గుంటూరు): ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు పడుతున్న ప్రస్తుత తరుణంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఇళ్లు, రోడ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బావుల వద్ద ముప్పు ఎక్కువగా ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణ, ఆస్తి నష్టాలు తప్పవు. ముఖ్యంగా పొలాల్లో వ్యవసాయ పనులు చేసే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. వర్షంలో వైర్లు తెగిపడినట్టు గుర్తిస్తే వాటి దగ్గరకు వెళ్లకుండా ఆ శాఖ వారికి సమాచారం ఇవ్వాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- తడి చేతులతో తీగలు, స్విచ్‌లు తాకొద్దు.
- విద్యుత్ సంబంధిత మరమ్మతులు సొంతంగా చేయొద్దు.
- సిబ్బంది సెల్ ఫోను నంబర్లు దగ్గర పెట్టుకోవాలి.
- వీధులు, పొలాల్లో తడిసిన స్తంభాలను తాకొద్దు.
- తోటలు, పొలాలు వంటి ప్రదేశాలలో విద్యుత్ తీగలు తెగితే వెంటనే 1912కి కాల్ చేయాలి.
- తీగలు తాకిన చెట్లను అంటుకోవద్దు.
- విద్యుత్ తీగలపై బట్టలు ఆరేయొద్దు.
- విద్యుదాఘాతం సంభవిస్తే వెంటనే సరఫరా నిలిపివేయాలి. బాధిత వ్యక్తిని ప్లాస్టిక్ లేదా ఎండు కర్రతో వేరు చేయాలి.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ

వర్షాకాలంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. వీధిలో గాలి, వర్షాలకు తీగలు తెగిపడితే వెంటనే సమాచారం అందించాలి. మరమ్మతులు చేయిస్తాం. విద్యుత్ సమస్యపై వెంటనే సమాచారం ఇవ్వాలి.

– కె.అక్కిరెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ, గుజ్జనగుండ్ల.